క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ఏఎన్‌ఎంతో మాట్లాడుతున్న కామేశ్వరరావ్

డోన్ : ప్రజలు వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావ్ అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గాంధీ నగర్ ప్రాంతంలో ఆశా, ఏఎన్‌ఎంలతో కలిసి డ్రమ్ములు, గచ్చులు, నీటితొట్లు, పూల తొట్లను పరిశీలించారు. నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజలపై అల్లాహ్ దయ ఉండాలి



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

సంజామల: అల్లాహ్ దయ అన్ని వర్గాల ప్రజల మీద ఉండాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సంజామలలోని మర్కస్ మజీద్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం సోదరులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



విందు వడ్డిస్తున్న చైర్మన్‌చలం రెడ్డి

బేతంచర్ల: హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని నగర పంచాయతీ చైర్మన్‌చలం రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఉపవాస దీక్షలు చేపట్టి న ముస్లిం సోదరులకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. చలం రెడ్డి స్వ యంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డక్కి శేఖర్, జశ్వంత్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వెచ్చించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి సూచించారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియ శుక్రవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాబు, పీఠం సభ్యులు వెంకటస్వామి, రాములమ్మ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

డోన్ : డోన్ తాలుకా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా షేక్షావలి, సహాధ్యక్షుడిగా హరిప్రసాద్, కోశాధికారిగా అబ్రార్ హుసేన్, ఉపాధ్యక్షులుగా పూల క్రిష్ణ, అనిత, వసంతరాయుడు, సహాయ కార్యదర్శులుగా లక్ష్మిభాగ్యమ్మ, చెన్నకేశవును ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఏపీ ఎన్‌జీఓస్ అధ్యక్ష, కార్యదర్శులు షమీముల్లా, ప్రేంకుమార్ తెలిపారు.

కార్మికుడికి పాముకాటు

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యలచెర్వు పాలిష్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు పాముకాటుకు గురయ్యాడు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన లవ్ సింగ్ పాలిష్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చేతికి పాము కాటు వేసింది. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

డోన్ : డోన్ తాలుకా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా షేక్షావలి, సహాధ్యక్షుడిగా హరిప్రసాద్, కోశాధికారిగా అబ్రార్ హుసేన్, ఉపాధ్యక్షులుగా పూల క్రిష్ణ, అనిత, వసంతరాయుడు, సహాయ కార్యదర్శులుగా లక్ష్మిభాగ్యమ్మ, చెన్నకేశవును ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఏపీ ఎన్‌జీఓస్ అధ్యక్ష, కార్యదర్శులు షమీముల్లా, ప్రేంకుమార్ తెలిపారు.

యువకుడికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ముదిగేడు ఆర్‌అండ్‌బీ రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంజామలకు చెందిన యువకుడు చెంచిరెడ్డి సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చి బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులోని ఎస్సార్బీసీ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అటుగా వెళ్తున్న వాహన చోదకులు సమాచారం మేరు 108 సిబ్బంది క్షతగాత్రున్ని కోవెలకుంట్ల ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీసీకి హైకోర్టు మొట్టికాయ!

- ఇంటిస్థలాలకు పేదలకు ఇవ్వొచ్చని హైకోర్టు తీర్పు
- పేదోళ్ల ఇళ్ల స్థలాల పంపిణీకి మోకాలొడ్డిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి చుక్కెదురు
- పేదలకు మంచి జరిగితే ఓర్చుకోలేని పెత్తాందారు నైజానికి గుణపాఠం
- కోర్టులో కేసు వేసి నాలుగేళ్లుగా లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెట్టిన వైనానికి చెంపపెట్టు
- హైకోర్టు తీర్పుతో 3,200 మంది లబ్ధిదారులకు తొలగిన అడ్డంకి
- సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసాని కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు

పెత్తందారుపై పేదవాడు విజయం సాధించాడు. పేదోడి నోటికాడ కూడు లాక్కుందామని ప్రయత్నించిన టీడీపీకి హైకోర్టు మొట్టికాయలేసింది. నాలుగేళ్లుగా ఇంటి స్థలాలు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టిన టీడీపీ నేతకు చెంప చెల్లుమనిపించేలా తీర్పు వెలువడింది. పేదలకు వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న హైకోర్టు తీర్పుతో ఇంటి స్థలాల పంపిణీకి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో పేదోళ్ల తరుపున నాలుగేళ్లు పోరాడిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు లబ్ధిదారులు. – సాక్షి, నంద్యాల

గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోలో భాగంగా అధికారంలోకి రాగానే పేదలందరికి ఇంటి స్థలాల కేటాయింపునకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బనగానపల్లెలోనూ అర్హులను ప్రభుత్వం గుర్తించింది. పేదలకు అనుగుణంగా స్థంటి స్థలాలు కేటాయించాలన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచన మేరకు పట్టణ శివారు ప్రాంతాల్లో స్థలాలు గుర్తించారు అధికారులు. అవుకు మెట్ట ఎస్సార్‌బీసీ కాలనీ సమీపాన, పట్టణ శివారుల్లోని అయ్యప్పస్వామి గుడి ఎదుట తదితర ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అధికారులు దాదాపు 131 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మేరకు బనగానపల్లె పట్టణంతో పాటు భానుముక్కల పాడు, యనకండ్ల, బత్తులూరిపాడు గ్రామాలకు చెందిన సుమారు 3,200 మంది పేదలకు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు కూడా. పేదలకు మంచి జరుగుతుంటూ ఓర్వలేని బీసీ అడ్డుపుల్ల వేశారు.

ఇళ్ల పట్టాల పంపిణీ జరక్కుండా కోర్టుకెళ్లిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ అనుచరులు

గూడు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు అందజేస్తే తన రాజకీయ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టవుతుందని భావించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపాడు. సైంధవుడిలా ఇంటి స్థలాల పంపిణీని తన అనుచరుతో కోర్టులో స్టే తీసుకొచ్చి అడ్డుకున్నారు. పేదలకు స్థలం దక్కకుండా విశ్వప్రయత్నాలు చేశాడు. దాదాపు నాలుగేళ్లు పైశాచికానందం పొందాడు. ఎమ్మెల్యే కాటసాని అంకితభావ పోరాటం ఫలించింది. ఎట్టకేలకు బీసీకి హైకోర్టు గట్టి గుణపాఠం చెప్పింది. పేదలకు గృహ వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తేల్చి చెప్పింది. అధికారులు ఎంపిక చేసిన భూమి పేదల ఇంటి స్థలాలకు కేటాయించడం సరైనదేనంటూ తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పుతో



బనగానపల్లె పట్టణంలో ఇళ్ల స్థలాల పంపిణీకి ఎంపిక చేసిన స్థలం

బనగానపల్లె పట్టణ ప్రజల కళ్లలో కాంతులు మెరుస్తున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఓటుతో బుద్ధి చెబుతాం

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీ అయ్యిందని, బీసీ జనార్ధన్‌రెడ్డి నిర్వాకంతో నాలుగేళ్లుగా ఇంటి స్థలం వస్తుందో రాదోనని లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అందరితో పాటు తమకు ఇంటి స్థలం ఇచ్చి ఉంటే ఇప్పటికే ఇళ్లు కట్టించుకుని సంతోషంగా ఉండేవాళ్లమని చెబుతున్నారు. ఇంటి స్థలం రాకుండా అడ్డుకోవాలనుకున్న బీసీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని ముక్తకంఠంతో చెబుతున్నారు లబ్ధిదారులు.

మాకు ఇంటి స్థలం ఇస్తే మీకెందుకు కడుపుమంటా



పేదోడు సంతోషంగా బతకడం ఇష్టం లేదా. మాకు ప్రభుత్వం స్థలం ఇస్తే మీకెందుకు కడుపుమంటా. నాలుగేళ్లుగా పట్టా కోసం ఎదురుచూస్తున్నాం. మిగిలిన అన్ని చోట్లా అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చారంట. మాకు మాత్రమే ఇలా జరిగింది. మీ ఉద్దేశాలు ఏమైనా ఉన్నా... మా మీద ఎందుకు చూపిస్తారు. జగనన్న ప్రభుత్వం వల్లే మాకు ఇంటి స్థలం వస్తోంది.

– సుధా, నాయీ బ్రహ్మణ కాలనీ, బనగానపల్లె

ఇక నుంచైనా అద్దె కష్టాలు తప్పుతాయి



సొంతిళ్లు కట్టించుకోవాలన్నది మా కోరిక. ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టిస్తామని చెబితే చాలా సంతోషం వేసింది. కానీ, టీడీపీ వాళ్లు కోర్టులో కేసులు వేసి మాకు స్థలాలు రాకుండా అడ్డుకోవడం దారుణం. మాలాంటి బీదవారు బాగుపడడం పెత్తందారులకు ఇష్టం లేదేమో. పట్టాలు పంపిణీ చేస్తే సొంతిళ్లు కట్టించుకుంటాం.

– సయ్యద్ బిపాషా బేగం, ఖాజీవాడ బనగానపల్లె

చెంప చెళ్లుమనిపించేలా తీర్పు



పేదోళ్ల ఇళ్ల పట్టాల పంపిణీకి పెత్తదార్లు అడ్డుపుల్ల వేశారు. ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కోర్టుల నుంచి స్టేలు తీసుకొచ్చారు. పేదోడు బాగుపడడం బీసీ జనార్ధన్ రెడ్డికి ఇష్టం లేదేమో. పేదలకు పెత్తందార్లకు జరిగిన పోరులో న్యాయదేవత పేదల వైపు నిలిచింది. కోర్టు తీర్పుతో అర్హులైన 3,200 మందికి పట్టాలు పంపిణీ చేస్తాం. మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే. ప్రభుత్వం వచ్చాక ఇంటి పట్టాలతో పాటు ఇళ్లు కట్టిస్తాం. పేదల సొంతింటి కల నెరవేరుస్తాం.

– కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్యే, బనగానపల్లె నియోజకవర్గం

చిరకాలకోరిక నెరవేరింది



ఇళ్ల స్థలాల పట్టాల కోసం చాల కాలంగా ఎదురు చూపు చూస్తున్నాం. మా కుటుంబంలో ఇంటి సభ్యులు ఎక్కు వ మంది ఉంటారు. అందరూఉండేందుకు ఇప్పు డు ఉంటున్న ఇల్లు సరిపోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చే స్థలంలో మంచి ఇల్లు కట్టించుకుందామని నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషితో ఇంటి స్థలం పంపిణీకి అడ్డంకులు తొలిగిపోయాయి. పట్టాలు పంపిణీ చేస్తే ఇళ్లు కట్టించుకుంటాం. – సి మహారాణి,బనగానపల్లె

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నాలుగేళ్లుగా ఇంటి స్థలం కోసం ఎదురుచూస్తున్నాం. 2019లోనే స్థలం వస్తుందని చెప్పారు. కానీ, కొంత మంది మాకు ఇంటి స్థలం ఇవ్వకుండా కోర్టులో కేసు వేశారంట. చాలా మంది స్థలం ఇక పోయినట్లే అని చెప్పారు. కానీ, సీఎం జగన్.. ఎమ్మెల్యే రామిరెడ్డి కృషితో హైకోర్టులో కేసు గెలిచాం అని చెబుతున్నారు. ఇంటి స్థలం ఇచ్చినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.– సి సుబ్బలక్ష్మి, బనగానపల్లె

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

కొలిమిగుండ్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుతాన్ని మరోమారు ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు రెండవ రోజు శుక్రవారం మండల కేంద్రం కొలిమిగుండ్లలోని కాలనీల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకుంటే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కొలిమిగుండ్ల మండలాన్ని ఎమ్మెల్యే కాటసాని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, ఎంపీటీసీ వెంకట రమణ, మాజీ ఎంపీపీ మెడగట్టు రామాంజనేయులు, నాయకులు పేరం నందకిషోర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఎంకే నాయుడు, బీగాల వెంకటసుబ్బయ్య, నాగేశ్వరరావు, శ్రీను, ఓబులేసు, జయరాజు, రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

జక్కసానికుంట్లలో బుగ్గన అర్జున్ విస్తృత ప్రచారం

ప్యాపిలి: మండల పరిధిలోని జక్కసానికుంట్ల, రాంపురం గ్రామాల్లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందాయన్నారు. గ్రామాల్లో తాగు, సాగు నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ పర్వతం లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, యోగి యాదవ్, పరమేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, గురివిరెడ్డి, నారాయణ, మల్లికార్జున, కృష్ణ, వెంకటరాముడు, కంబగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

మూట,ముల్లె సర్దుకునేందుకు సిద్ధంగా ఉండండి

డోన్ : పదిహేనేళ్లుగా డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి ఎక్కడ ఉన్నారో చెప్పాలని రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ప్రశ్నించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించే ముందు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఇన్నేళ్లు డోన్ నియోజకవర్గం వదిలి ఎక్కడ దాక్కున్నారో చెప్పాలని వారు నిలదీశారు. ముఠా కక్షలకు దూరంగా నియోజకవర్గాన్ని ఎంతో ప్రశాంతంగా ఉంచి అభివృద్ధి పథంలో డోన్‌ను అగ్ర భాగాన నిలిపిన మంత్రి బుగ్గనను ఎక్కడ అని ప్రశ్నించడం కోట్లకు సిగ్గు చేటన్నారు. ముఠా కక్షలను ప్రేరేపించడం తప్పా యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో కోట్ల, కేఈ కుటుంబాలు సాధించిందేమీ లేదని ప్రజలందరికీ తెలుసన్నారు. డోన్ మోడల్ నియోజకర్గంగా తీర్చిదిద్దిన మంత్రి బుగ్గనకు హాట్రిక్ విజయం అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కోట్ల, కేఈ కుటుంబాలు డోన్ నుంచి వెళ్లేందుకు మూటా, ముల్లె సర్దుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మాజీ సింగిల్ విండ్ చైర్మన్ సోమేష్‌యాదవ్, నాయకులు దినేష్‌గౌడ్, ఆర్‌ఈ రాజవర్ధన్, ధర్మారం మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి

డోన్ : అన్నివర్గాలకు అర్హత మేరకు సంక్షేమ పథకాలు వర్తింపజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోమారు పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్‌సప్తశైల రాజేష్ ప్రజలను కోరారు. స్థానిక ఒకటవ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసిన ఘనత మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నాగిరెడ్డి, రమేష్, సుమలత సురేష్, వంశి, సతీష్, పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, కౌన్సిలర్లు వెంకట్రాముడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

మహిళల సంక్షేమానికి పెద్ద పీట

బేతంచెర్ల: మహిళలు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ తదితర పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తవిసి కొండ, హుసేనాపురం గ్రామాల్లో సర్పంచ్ లక్ష్మిదేవి, నాయకులు బండి కాటి వెంకటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రానున్న ఎన్నికల్లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు శేఖరయ్య, గూనినాగరాజు, ఎద్దులన్న, తిరుమలేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎల్ల నాగిరెడ్డి,మద్దిలేటి, రామనాయుడు, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మద్దిలేటిస్వామి ఆలయ మాజీ చైర్మన్లు లక్ష్మిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన

పేదలు.. పెత్తందార్ల మధ్య జరిగే ఎన్నికలు..!

- పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండ
- జగన్ మరలా సీఎం కావాలని ప్రార్థనలు చేయండి
- పాస్టర్ల సేవా సదస్సులో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: పేదలంతా ఒకవైపు పెత్తందారు మరో వైపు ఉండి జరుగుతున్న ఎన్నికలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు సంబంధించి హోలిగాడ్స్ పాస్టర్స్ అసోసియేషన్ సేవకుల సదస్సు నిర్వహించారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, శ్రీరాముల అబ్రహంతో కలిసి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన ఉండి పెత్తందారులతో పోరాటం చేస్తున్నారన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమయ్యాయని, మరెన్నో జెండాలు జతకట్టాయని, ఆయా పార్టీల నాయకులు కుట్రలు, కుతంత్రాలతో కూడిన రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని పార్టీలు కలిసినా, జెండాలు జతకట్టినా ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారని, ఆయనను మరలా సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

మంచి జరిగి ఉంటే ఓటు వేయండి:

సంక్షేమ పథకాల ద్వారా మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే నాకు ఓటు వేయండి అని దమ్ము, ధైర్యంతో ప్రజలను అడుగుతున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. 2014 సంవత్సరం నుంచి 2019వ సంవత్సరం వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండిందని, తాము మంచి పాలన అందించి ఉంటేనే ఓటు వేయండని అడిగే దమ్ము టీడీపీ నాయకులకు ఉందా అని నిలదీశారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు మాత్రం జగన్ పక్షాన ఉండి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. పాస్టర్ల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారని, వారికి నెలకు రూ. 5వేలు గౌరవ వేతనం అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయడంకా మోగించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని ప్రత్యేక పార్దనలు చేయాలని పాస్టర్లను కోరారు. కోవెలకుంట్ల పాస్టర్లు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఒక పంక్షన్‌హాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఫంక్షన్‌హాలుతోపాటు అర్హులైన పాస్టర్లకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పాస్టర్లు దేవరాజు, ఆశీర్వాదం, దేవభూషణం, శైలాష్, జాన్‌వెస్లీ, శేఖర్, అగస్టీన్, లూర్దయ్య, ప్రకాష్, మోహన్‌బాబు, దేవదత్తు, తదితరులు పాల్గొన్నారు.

అంతా ప్రచారార్భాటమే!

టీడీపీ వారికే కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నాయకులంటూ ప్రచారం తగదు



కాటసాని తిరుపాల్ రెడ్డి

అవుకు: అవుకు మండలంలో పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరా రంటూ తేదేపా నాయకులు చేస్తున్న ప్రచారంలో అస్సలు వాస్తవమేలేదని, వారంతా టీడీపీకి చెందినవారేనని అవు కు మండల వైస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు కాశిపురం అయ్యపురెడ్డి, సుంకేసుల నాగేశ్వర్ రెడ్డి, చనుగొండ్ల రామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు ప్రచారార్భాటానికి పాల్పడుతున్నారని, తమపార్టీ వ్యక్తులకే కండువాలు కప్పి పైశాచికానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. చనుగొండ్లలో 70 కుటుంబాలు, సుంకేసులలో 80 కుటుంబాలు, కాశిపురంలో 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీపై అసమ్మతితో బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకున్నట్లు ఆ పార్టీ నాయకులు సోషల్ మీడియాల్లో ప్రచారం చేసుకోవడం హేయమైన చర్యగా ఖండించారు. వారంతా 2019 ఎన్నికల్లో టీడీపీకి పని చేసినవారేనని అందరికీ తెలుసని, ప్రచారార్భాటాన్ని ప్రజలు నమ్ముతారనుకోవడం తమ్ముళ్ల అవివేకమేనన్నారు. కాటసాని రామిరెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని, వారంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నారనే విషయాన్ని తెలుసుకుని మసలుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందరికీ న్యాయం

డోన్ రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాయని, అందరికీ న్యాయం జరిగిందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దొరపల్లిలో శుక్రవారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రూ. 3,500కోట్లతో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్ కుమార్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, మండల యువ విభాగం అధ్యక్షుడు చిరంజీవి, గ్రామ నాయకులు రామాంజినేయులు, మధు, సుధాకర్, రాముడు, సిద్దయ్య, వెంకటేష్, అలంకొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

కూటమిని నమ్మి మోసపోవద్దు



కోవెలకుంట్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కర్రా గిరిజ, కాటసాని ప్రణీతారెడ్డి

కోవెలకుంట్ల: మాయమాటలతో ప్రజల్లోకి వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని నమ్మొద్దు, వారికి ఓట్లు వేస్తే నట్టేట ముంచేస్తారని ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోడలు మేధాశ్రీరెడ్డి, కుమార్తె ప్రణీతారెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం వీధి, గాంధీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ షాజహాన్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ తదితరులతో కలిసి గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి వైఎస్సార్‌సీపీకి మరలా పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నాయకులు గువ్వల రామకృష్ణారెడ్డి, అక్బర్‌బాషా, సుధాకర్‌రెడ్డి, రమేష్, డీసీ ఉసేన్, గజ్జెలరెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: స్థానిక కోవెలకుంట్ల- నంద్యాల ఆర్ అండ్‌బీ రహదారిలోని పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఎస్‌ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేశారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఎస్‌ఐ తిరుపాల్ శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో వాహనాలను క్షణ్ణంగా తనిఖీ చేశారు